
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY 5



శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 6 జూలై 2025

అందని పండు!

పండ్లతోటల పెంపకానికి రైతుల ఆసక్తి

ఐదెకరాలు దాటితే వర్తించని ఉపాధి హామీ పథకం

పదెకరాల వరకు అవకాశం కల్పించాలని డిమాండ్

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వర్షాధార పంటలు సాగు చేసి జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక.. ప్రయోజనం లేదన్న నిర్ణయానికొచ్చారు. పండ్లతోటల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద పంటలు పెట్టాలనుకుంటే నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయి. ఐదెకరాల్లోపు భూమి ఉన్న వారే అర్హులు కావడంతో చాలా మంది రైతులు నిరాశ చెందుతున్నారు. బిందు, తుంపర సేద్యం పరికరాల సబ్సిడీ వర్తింపునకు ఐదెకరాలే అన్న నిబంధన ఉంది. టీడీపీ హయాంలో జిల్లా పరిస్థితులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా.. పదెకరాలకు సడలించారు. అనంత రైతులపై కరుణ చూపారు. పండ్లతోటల పెంపకానికి కూడా పదెకరాల వరకు నిబంధనలు సడలించాలని జిల్లా అన్నదాతలు కోరుతున్నారు. ఆ దిశగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని మనవి చేసుకుంటున్నారు.





తనకల్లు, జూలై5(ఆంధ్రజ్యోతి): కూలీలకు పనుల కల్పన, గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు, పండ్లతోటల పెంపకం, భూగర్భ జలాల అభివృద్ధి, అడవులు, పచ్చదనం పెంపొందించడం తదితర అనేక కార్యక్రమాలకు ఉపాధి హామీ పథకం నిధులను వినియోగిస్తున్నారు. పండ్లతోటల పెంపకానికి రాష్ట్రవ్యాప్తంగా ఒకే మార్గదర్శకాలను అమలుచేస్తున్నారు. నిబంధనల కారణంగా జిల్లాకు చెందిన చిన్న, సన్నకారు రైతులు.. ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల పెంపకానికి దూరమవుతున్నారు. ప్రభుత్వ పథకాలు పొందడంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు కిందిస్థాయి సిబ్బంది ద్వారా ఉన్నతాధికారులు తెలుసుకుని, ప్రభుత్వానికి నివేదికలు పంపాలి. ఆ దిశగా జిల్లా యంత్రాంగం చొరవ చూపట్లేదని రైతులు, ప్రజాసంఘాల నాయకులు వాపోతున్నారు. ఉపాధి పథకంలో పండ్లతోటల పెంపకం వర్తింపునకు నిబంధనల సడలింపు విషయాన్ని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే 5 ఎకరాలు దాటిన వారికి అవకాశం కల్పిస్తారన్నది రైతుల ఆకాంక్ష. ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు ఉపాధి పథకంలో వివిధ రకాల పండ్లు, పూలతోటలు, గడ్డిపెంపకం లాంటి కార్యక్రమాలు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఐదెకరాలు దాటిన రైతులకు ఈ అవకాశం నిబంధనల పేరుతో లేకుండా చేశారు. దీంతో తనకల్లు మండలంలో ఎంతోమంది రైతులు ఉపాధి పథకంలో పండ్లు, పూలతోటలు, గడ్డి పెంపకానికి దూరమవుతున్నారు

చాలామంది రైతులు అర్జీలు ఇస్తున్నారు



మండలంలో చాలామంది ఐదెకరాలు దాటిన రైతులు పండ్లతోటల సాగుకు ముందుకు వచ్చి అర్జీలు ఇస్తున్నారు. నిబంధనల మేరకు ఐదెకరాల్లోపు ఉన్నవారికే అవకాశం ఉంది. ప్రభుత్వం అనుమతిస్తే తప్పకుండా వర్తింపజేస్తాం.

-మరియమ్మ, ఏపీఓ, తనకల్లు

అవకాశం కల్పిస్తే పండ్లతోట సాగుచేస్తా

నాకు 7 ఎకరాల భూమి ఉంది. నీటి సౌకర్యం లేదు. వర్షాధార పంటలు సాగుచేసినా ఫలితం దక్కట్లేదు. పొలాలను బీళ్లుగా వదిలేశాం. ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల పెంపకం చేపడదామని అధికారుల వద్దకెళితే ఐదెకరాలు దాటిన వారికి అవకాశం లేదని తిప్పి పంపారు. ప్రభుత్వం పండ్లతోటల పెంపకానికి అవకాశం కల్పించాలి.

-రెడ్డెప్పరెడ్డి, రైతు, దండువారిపల్లి



నిబంధనలు సడలించాలి

నాకు 8.50 ఎకరాల భూమి ఉంది. పండ్లతోటల సాగు కోసం ప్రయత్నిస్తే లాభం లేకుండాపోయింది. గ్రామ పరిధిలో వందలాది ఎకరాల్లో పండ్లతోటలు ఉన్నాయి. నిబంధనలు సడలించి మెట్ట ప్రాంత రైతులకు పదెకరాల వరకు అవకాశం కల్పించాలి.

- సుబ్బిరెడ్డి, రైతు, గొళ్లవారిపల్లి



జగన్నాథా.. జయహో



బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు అశేష భక్త జనం నడుమ నగరంలో ఊరేగాడు. ఇస్కాన్ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో శనివారం రథయాత్ర నిర్వహించారు. ఇస్కాన్ జాతీయ ప్రతినిధి సత్యగోపీనాథ్ దాస్, సినీ నటుడు సుమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. యాత్ర సాగే మార్గాన్ని యువతులు, మహిళలు రంగవల్లికలతో అలంకరించారు. రథం ముందు కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓం సంగీత నృత్య కళానిలయం నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య బృందం కోలాట ప్రదర్శన నిర్వహించారు. రథోత్సవం ముందు కేఎస్ఆర్ కళాశాల వద్ద నిర్వహించిన సభలో సత్యగోపీనాథ్ దాస్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా నాలుగు వేల ప్రాంతాల్లో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ రంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు చిరంజీవి రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్



జగన్నాథుడి రథయాత్ర సంబరం



రథయాత్ర ముందు బంగారు చీపుర్లతో ఊడుస్తున్న భక్తులు

కన్నుల పండువగా గ్రామోత్సవం



గ్రామాల పర్యటనకు వెళ్లిన ఖాసీం స్వామి

బత్తలపల్లిలో ఘనంగా మొహర్రం వేడుకలు

6 లో

10న కొత్తచెరువుకు ముఖ్యమంత్రి

- మెగా పీటీఎంకు హాజరు
- సమన్వయంతో పర్యటనను విజయవంతం చేద్దాం
- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూలై5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 10వ తేదీన కొత్తచెరువుకు వస్తున్నారని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ కమిటీ (పీటీఎం), తల్లికి వందనం, పీ4 పథకం, ముఖ్యమంత్రి జిల్లా పర్యటన తదితర అంశాలపై ఎస్పీ రత్నతో కలిసి కలెక్టర్ సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి కొత్తచెరువు పర్యటన ఖరారైందన్నారు. పీటీఎం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. పీ4 పథకం ద్వారా బంగారు కుటుంబాలకు తమవంతు సహకారం అందించడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. తల్లికి వందనం పథకానికి జిల్లాలో ఇప్పటివరకు 14,703 ఫిర్యాదులు అందాయనీ, వాటిలో 10,803 పరిష్కరించామన్నారు. మిగిలిన వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కార్యక్రమాలకు సంబంధించి అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుని, భద్రతను పటిష్టం చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

సార్.. వెళ్లొద్దు ప్లీజ్..

- బదిలీపై వెళ్తున్న హెచ్ఎం
- వద్దంటూ కన్నీళ్లు పెట్టుకున్న విద్యార్థులు

అగళి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడి కోసం విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకున్నారు. బదిలీపై వెళ్లొద్దంటూ వేడుకున్నారు. మండలంలోని అనుమనపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్యను వెళ్లొద్దంటూ విద్యార్థులు కన్నీళ్లతో విన్నవించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు రెండేళ్ల క్రితం పాఠశాలకు హెచ్ఎంగా వచ్చారు. పిల్లల పట్ల ఎంతో ఆప్యాయతగా మెలిగారు. ఆయన తాజాగా ఓబుళదేవరచెరువు పాఠశాలకు బదిలీ అయ్యారు. శనివారం రిలీవ్ అయ్యారు. దీంతో హెచ్ఎం ఈశ్వరయ్యను విద్యార్థులు చుట్టుముట్టారు. వెళ్లిపోవద్దంటూ ఏడ్చేశారు. దీంతో హెచ్ఎం కూడా భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం హెచ్ఎంకు టీచర్లు శాలువాకప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.



హెచ్ఎం ఈశ్వరయ్య బదిలీ కావడంతో కన్నీరు పెట్టుకుంటున్న విద్యార్థులు

అలరించిన సాయివిఠల్ వాణి

ప్రశాంతి నిలయంలో తొలి ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం



మహారాష్ట్ర భక్తుల సాంస్కృతిక ప్రదర్శన

పుట్టపర్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శనివారం మహారాష్ట్ర భక్తులు సాయివిఠల్ వాణి పేరిట నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అలరింపజేసింది. ప్రశాంతి నిలయంలో తొలి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహారాష్ట్ర భక్తులు పర్తియాత్ర పేరిట పెద్దఎత్తున ప్రశాంతి నిలయం చేరుకున్నారు. యువకులు గాన కచేరి నిర్వహించారు. సాయంత్రం మరాఠీ గాయకుడు ఆర్య అంబేకర్ బృందం నిర్వహించిన కచేరి భక్తులను మైమరపింపజేసింది. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

సోమందేపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె మండలంలోని మాగేచెరువు, చాలకూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆయా గ్రామాల ప్రజలు నీరాజనం పలికారు. అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పెన్షన్లు, ఇళ్లు, రోడ్లు, డ్రైనేజీలు తదితరవాటిపై ప్రజలు అర్జీలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రానికి లక్షల కోట్లు పెట్టుబడులు తెస్తున్నట్లు తెలిపారు. మాగేచెరువులో రూ.60లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు.



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న మంత్రి సవిత

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం కదిరేపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంత్రి సవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీవారి అభ్యర్థన మేరకు ఆమె ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆమె వెంట కమిటీ సభ్యులు రామక్రిష్ణ, శరత్ చంద్ర, సర్పంచ్ నరసింహులు, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, నీరుగంటి చంద్ర, కన్వీనర్ వెంకటేశులు, సీసీహరి, సిద్దలింగప్ప తదితరులు ఉన్నారు.

భక్తితో గిరి ప్రదక్షిణ



ఖాద్రీగిరిపై భజన చేస్తున్న భక్తులు

కదిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి ఖాద్రీగిరి ప్రదర్శనకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. స్వాతి నక్షత్రం సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు, చిన్నారులు, యువకులు, పట్టణ ప్రముఖులు ఖాద్రీగిరి ప్రదక్షిణ చేశారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి పాదయాత్రగా బయలు దేరి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆర్డీవో వీవీఎస్ శర్మ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ సమితి సభ్యులు పానకం, తాగునీరు, మజ్జిగ సౌకర్యాలు కల్పించారు. పట్టణానికి చెందిన కోటిరెడ్డి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఆశా పోస్టుకు 83 దరఖాస్తులు

గుంతకల్లు, అనంతపురంలో తీవ్ర పోటీ

7 లో

గుట్టపై వైసీపీ గద్దలు..!

జగనన్న లే అవుట్‌కు గుట్టలో మట్టి తవ్వకాలు

అదే స్థలం దర్జాగా కబ్జా

బోర్డు పాతి.. చేతులు దులుపుకున్న అధికారులు



7 లో

బైకును ఢీకొట్టిన బొలెరో

- ఇద్దరి దుర్మరణం
- పీర్లను చూసేందుకు వెళ్తుండగా ప్రమాదం

పన్నుల శాఖ జేసీగా హేమ

- డీసీతోపాటు సీటీఓలు, డీసీటీఓల బదిలీ

నేడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు

భారీగా చేరుకుంటున్న భక్తులు



నార్పల, జూలై 5(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి ఇష్టమైన పెద్ద సరిగెత్తు ఆదివారం నిర్వహించనున్నారు. శనివారం స్వామికి విడిది దినం కార్యక్రమం నిర్వహించారు. కుళ్లాయి స్వామి, ఆంజనేయస్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తాదులు అగ్నిగుండంలో మొద్దులు వేసి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సరిగెత్తుకు లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారని అంచనా. దీంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. పలువురు దాతలు.. భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పూజలు అందుకుంటున్న కుళ్లాయిస్వామి

భక్తురాలి మెడలో గొలుసు చోరీ



బాధితురాలు జయమ్మ

నార్పల, జూలై5(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చిన జయమ్మ అనే భక్తురాలి మెడలోని రెండున్నర తులాల బంగారు చైన్‌ను గుర్తుతెలియని దుండుగులు చోరీ చేశారు. మండలంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన జయమ్మ శనివారం ఉదయం 7 గంటలకు స్వామి దర్శనం కోసం వచ్చింది. ఆ సమయంలో గుర్తుతెలియని దుండగులు జయమ్మ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్‌ను ఎత్తుకెళ్లారు. చోరీపై బాధితురాలు జయమ్మ కుమారుడు చౌరెడ్డి.. నార్పల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కన్నుల పండువగా గ్రామోత్సవం

గ్రామాల పర్యటనకు వెళ్లిన ఖాసీం స్వామి

బత్తలపల్లిలో ఘనంగా మొహర్రం వేడుకలు

బత్తలపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఖాసీం స్వామి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. ఖాసీం స్వామి పీరును రకరకాల పుష్పాలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. తప్పెట్లు, మేళతాళాల మధ్య శనివారం తెల్లవారుజామున 5గంటలకు మకానం నుంచి ఖాసీం స్వామి పీరును బయటకు తెచ్చారు. దీంతో పరిసర ప్రాంతాలు ఖాసీంస్వామి నామస్మరణతో మార్మోగాయి. గ్రామ వీధుల్లో పీరును ఊరేగించారు. ఇందులో భాగంగా గ్రామ పినపెద్ద జక్కంపూటి వెంకటేశు సమాధి వద్దకు చేరుకొని కొబ్బరికాయ కొట్టారు. అనంతరం గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లారు. ఆయా గ్రామాల్లో పీర్లు ఖాసీం స్వామికి ఎదురు వచ్చి భేటీ తీసుకున్నారు. ఈ భేటీని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమములో జక్కంపూటి సత్యనారాయణ, నాగభుషణ, తిరుపాలు, పురుషోత్తమచౌదరి, సుబ్బరాయుడు, జయప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్ద సరిగెత్తు

మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బత్తలపల్లిలో ఆదివారం పెద్ద సరిగెత్తు నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.





గ్రామ వీధుల్లో ఊరేగుతున్న ఖాసీం స్వామి, వేల్పుమడుగులో ఖాసీం స్వామితో పీర్ల భేటీ

ఫ్రీ హోల్డ్‌కు ఇక మోక్షం..!

- జాబితాలో 34 వేల ఎకరాలు
- వేలాదిమంది రైతుల ఎదురుచూపు
- నిషేధం తొలగింపుతో హర్షం

అనంతపురం కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఫ్రీ హోల్డ్ భూములపై నిషేధం తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమౌతోంది. ఫ్రీ హోల్డ్ కోసం వేలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం 2023లో ఏపీ అసైన్డ్ భూముల చట్టం-1977(పీఓటీ)ను సవరించింది. అసైన్‌మెంట్ కాల పరిమితిలో 20 ఏళ్లు దాటిన భూములను నిషేధ జాబితా నుంచి తొలగించి (ఫ్రీ హోల్డ్) లబ్ధిదారులకు శాశ్వత





హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పట్లో కొన్ని భూముల విషయంలో అక్రమాలు జరిగాయని, రికార్డు లేనివి, చుక్కల భూములు కూడా ఫ్రీ హోల్డ్ చేసినట్లు నిర్ధారించింది. దీంతో వాటిని నిషేధిత జాబితాలోకి చేర్చారు. అప్పటి నుంచి వేలాది మంది రైతులు ఆ భూములపై ఉన్న నిషేధం ఎప్పుడు ఎత్తివేస్తారోనని ఆశతో ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయంతో బాధితులకు ఊరట కలగనుంది.

ఫ్రీ హోల్డ్‌లోకి అలా...

వైసీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 13 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ భూముల కమిటీ(పీఓటీ) చట్టం-1977లో 2023లో అప్పటి సర్కారు సవరణలు చేసింది. పేదలకు అసైన్డ్ చేసిన భూముల కాల పరిమితి 20 ఏళ్లు దాటి ఉంటే వాటిని నిషేధిత జాబితా (22)(ఏ) నుంచి తొలగించి (ఫ్రీ హోల్డ్) లబ్ధిదారులకు శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించాలని చట్ట సవరణ చేశారు. దీని అమలుకు అదే ఏడాది డిసెంబరు 19న 596 జీఓ ఇచ్చారు. ఆ జీఓ ఆధారంగా అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయాలి. అనంతరం ఆ భూములను రైతుల పేరిట ఎక్కిస్తారు. ఈ ప్రక్రియ ముగిశాక సంబంధిత రైతులు ఆ హక్కు కల్పిస్తారు. తద్వారా ఆ భూములను అమ్ముకునే హక్కు రైతులకు ఉంటుంది.

ఆ ముసుగులో దందా...

జిల్లా వ్యాప్తంగా దాదాపు 34,497 ఎకరాలను ఫ్రీ హోల్డ్ కింద చేర్చారు. అందులో జీఓ 596ను ఉల్లంఘించి మరీ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి కొన్ని ఎకరాల భూములు తొలగించారు. వాటిలో చట్టపరిధిలో లేని భూములు, రికార్డులు లేనివి, సర్వీస్ ఇనాం, షరతు గల పట్టా, చుక్కల భూములను సైతం ఫ్రీ హోల్డ్ చేశారని సమాచారం. అలా జిల్లాలో 2500 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం. శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి, అనంతపురం రూరల్, పామిడి తదితర ప్రాంతాల్లో ఎక్కువ రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిసింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రీ హోల్డ్ ముసుగులో దందా జరిగినట్లు గుర్తించారు. దీంతో గత ఏడాది ఆగస్టులో ఫ్రీ హోల్డ్ భూములు రిజిస్ట్రేషన్లు, తదితర వాటిపై నిషేధం విధించారు.

ఎదురు చూస్తున్న రైతులు..

ఫ్రీ హోల్డ్ నిషేధం తొలగించడంతో రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వేలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. అత్యధికంగా ఎకరం, రెండు ఎకరాలున్న రైతులు ఉన్నారు. ఫ్రీ హోల్డ్‌లో భాగంగా బినామీ, అక్రమాలతో కూడిన భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని నిర్ణయించారు. మొత్తం అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించడంతో నిజమైన హక్కుదారులకు అన్యాయం జరుగుతోందని ప్రభుత్వం గుర్తించింది. నిషేధం ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో క్రయ, విక్రయదారులతో రిజిస్ట్రేషన్లు జరిగి రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వానికి సైతం ఆదాయం సమకూరనుంది.

కౌన్సెలింగ్ తూచ్...!

సచివాలయ ఏఎన్ఎంలకు షాక్

రీ కౌన్సెలింగ్‌కు ఆదేశాలు



ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి(ఫైల్)

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి కౌన్సెలింగ్ నిర్వహించారు. కోరుకున్న స్థానాలను దక్కించుకునేందుకు ఏఎన్ఎంలు తంటాలు పడి సిఫార్సు లేఖలను సమర్పించుకున్నారు. పైరవీలు.. జూమ్ మీటింగ్‌లు.. వ్యయప్రయాసలు.. అన్నీ పూర్తి అయ్యాయి. ఇక ఆర్డర్ కాపీలు ఇవ్వడమే తరువాయి. అవి కూడా సిద్ధమయ్యాయి. ఇంతలోనే అంతా తూచ్ అన్నారు. రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో సచివాలయ ఏఎన్ఎంలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మైండ్ బ్లాంక్ అయింది. గత నెల 30వ తేదీకి సచివాలయ ఏఎన్ఎంల బదిలీలకు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఈనెల ఒకటో తేదీనే ఆర్డర్ కాపీలను ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయి. దీంతో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఏఓ గిరిజ మహేశ్వరరావు, విభాగ అధికారి కమలాకర్ రాజు తదితరులు కంటిమీద కునుకులేకుండా శ్రమించారు. ఏఎన్ఎంలు తమ మొబైల్ ఫోన్‌లను ముందు పెట్టుకుని.. జూమ్ కౌన్సెలింగ్‌లో తమ వంతు ఎప్పుడు వస్తుందా అని నిరీక్షించారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు పరుగులు పెట్టించారు. ఉమ్మడి జిల్లాలో 1,133 మంది ఏఎన్ఎంలు ఉన్నారు. వీరిలో కొందరికి గతనెలలో హెల్త్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. కానీ వారికి స్థానాలు ఇవ్వకుండా అక్కడే ఉంచారు. ఇలా 300 పైగా పోస్టులను ఖాళీ చూపించి, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ కౌన్సెలింగ్‌ను తాజాగా రద్దు చేశారు. రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ఆదేశించారు. రీ కౌన్సెలింగ్ ఎప్పుడు అనేది త్వరలో ప్రకటిస్తామని డీఎంహెచ్ఓ తెలిపారు.

బుట్టలోకి సిఫార్సులు

కౌన్సెలింగ్‌లో కోరుకున్న స్థానాలు దక్కని ఏఎన్ఎంలు డీఎంహెచ్ఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రక్రియ ముగిసిందని అధికారులు చెప్పడంతో ఉద్యోగ సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. వాటిని అధికారులు పరిశీలించి, కొంతమందికి వెసులుబాటు కల్పించారు. ఇప్పుడు రీ కౌన్సెలింగ్ అనడంతో ఆ కష్టమంతా వృథా అయ్యిందని బాధితులు వాపోతున్నారు. సిఫార్సులన్నీ బుట్టలోకేనని, మళ్లీ ప్రయాస పడకతప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేరా?

- కార్యాలయ పర్యవేక్షకులకు దక్కని గెజిటెడ్ హోదా
- పెండింగ్ పడుతున్న ఫైళ్లు
- వైద్య, ఆరోగ్యశాఖలో వింత వైఖరి





జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో కార్యాలయ పర్యవేక్షకుల(ఆఫీస్ సూపరింటెండెంట్)కు గెజిటెడ్‌హోదా లేకపోవడంతో సంబంధిత విభాగాల్లో ఫైల్స్ పేరుకుపోతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఒక్కో ఫైల్ క్లియర్ కావాలంటే రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కార్యాలయ పర్యవేక్షకులకు గెజిటెడ్ హోదా కల్పిస్తామని కలెక్టర్ నుంచి రాష్ట్ర స్థాయి అధికారులవరకు హామీ ఇచ్చినా.. సంబంధిత ఫైల్‌ను, జీఓ కాపీలను పరిశీలించిన పాపాన పోలేదని ఉద్యోగవర్గాలు వాపోతున్నాయి.

ఫైళ్ల క్లియరెన్స్‌లో ఆలస్యం

ఉద్యోగ విరమణ పొందిన తరువాత ఆ వ్యక్తికి చెల్లించే ఆర్థిక ప్రయోజనాల వివరాలను ఒక ఫైల్‌గా రూపొందిస్తారు. ఏఏ విభాగంలో పనిచేశారు. ఎంతకాలం పోస్టులో ఉన్నారు. ఆ సమయంలో ఏవైనా కార్యాలయం, ప్రభుత్వానికి సంబంధించిన ఫైనాన్షియల్ పెండింగ్ ఉన్నాయా?. విధుల నిమిత్తం వినియోగించుకున్న ఉపకరణాలు, వస్తువులు తిరిగి అప్పజెప్పారా? ఆర్థిక ప్రయోజనాల మొత్తం ఎంత? తదితర అంశాలను ఫైల్‌లో పొందుపరుస్తారు. ఆ ఫైల్‌ను ఆఫీస్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నుంచి ఉన్నతాధికారి వరకు పరిశీలించి ఆమోదం పొందిన తరువాతనే సంబంధిత ఉద్యోగి ఆర్థికప్రయోజనాలు పొందుతాడు. ఇలా అన్ని కార్యకలాపాలు ప్రభుత్వ శాఖల్లో ఫైల్ ద్వారా నడుస్తాయి. అయితే మొదటిమెట్టుగా ఫైల్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే ఆఫీస్ సూపరింటెండెంట్‌కు గెజిటెడ్ హోదా లేకపోవడంతో వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్నతాధికారికి ఫైల్స్ చేరడంలో జాప్యం నెలకొంటోందని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఖర్చు లేకుండా గెజిటెడ్

గెజిటెడ్ హోదాకు రాష్ట్ర ప్రభుత్వ ఎలాంటి ఖర్చు చేయాల్సిన అవసరంలేదు. హోదా ఇచ్చినంత మాత్రాన సంబంధిత ఉద్యోగికి ఇంక్రిమెంట్లు చెల్లించాల్సిన పనిలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం ఉత్తర్వులు జారీచేయడానికి సంవత్సరాల తరబడి కాలం వెల్లదీస్తుండటం ఏంటని ఉద్యోగవర్గాలు ప్రశ్నిస్తున్నాయి. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలో ఇద్దరు చొప్పున, సర్వజన వైద్యశాలలో ముగ్గురు చొప్పున ఇలా డీసీహెచ్ఎస్ తదితర కార్యాలయాల్లో పదుల సంఖ్యలో ఆఫీస్ సూపరింటెండెంట్లు పనిచేస్తున్నారు. వారికి గెజిటెడ్ హోదా కల్పిస్తే ఫైల్స్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ అవుతాయని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

తలరాత బాగుండాలి..!

- అప్పుడే మంచి జరుగుతుంది
- పర్మినెంట్‌గా ఎవరినీ తొక్కేయలేరు
- సినీనటుడు సుమన్



ఎంపీ అంబికాతో మాట్లాడుతున్న హీరో సుమన్

అనంతపురం కలెక్టరేట్/క్రైం, జూలై 5(ఆంధ్రజ్యోతి): సినిమాలైనా, రాజకీయాలైనా తలరాత బాగుంటే మంచి జరుగుతుందని సినీ నటుడు సుమన్ అన్నారు. అనంతపురంలో శనివారం జరిగిన జగన్నాథ రథయాత్రలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నగరంలోని బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అవుతారని ఏ జ్యోతిష్యుడూ చెప్పలేదని అన్నారు. గత ఎన్నికల్లో ఆయన అన్ని సీట్లూ ఓడిపోయారని, తనను ఒక్కసారైనా అసెంబ్లీకి పంపాలని ప్రజలను కోరారని అన్నారు. బిజినెస్‌లో అంబానీ తదితరులు పైకి వచ్చారని, రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుందని అన్నారు. తొక్కడం లాంటివి పర్మినెంట్ కాదని, ఇది తన అనుభవమని అన్నారు. సినీ ఇండస్ట్రీలో 47 ఏళ్లలో ఎన్నో ఆటుపోట్లు చూశానని, సినీ ఫీల్డ్‌లో డబ్బు కావాలని అన్నారు. ఇదొక వ్యాపారమని అన్నారు. థియేటర్లు, షోలు అలాగే నడుస్తాయని అన్నారు. సీఎం చంద్రబాబు తనకు రాజకీయ గురువు అని, వాజ్‌పేయి హయాంలో తాను ఎన్నికల ప్రచారం చేశానని అన్నారు. వాజ్‌పేయి ఓడిపోయాక తాను రాజకీయాల నుంచి బయటకు వచ్చానని అన్నారు. జైలులో ఉన్న వాళ్లకు ఓటు హక్కు ఎందుకివ్వరు..? ప్రజాస్వామ్యంలో ఇది ఏమిటి అని ప్రశ్నించారు. రాజ్యసభ సీట్లను వేరే ప్రాంతం వారికి ఇస్తున్నారని, ఇలా చేస్తే స్థానికుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాల్లో కన్ఫ్యూజన్ ఉందని, అందుకే ప్రస్తుతం రాజకీయాల్లోకి వెళ్లే ఆసక్తి లేదని అన్నారు. అనంతరం నాలుగో రోడ్డుకు చెందిన విద్యార్థి భానుప్రకాష్‌కు రమేష్‌గౌడ్ చేతుల మీదుగా రూ.1.20 లక్షల చెక్కును అందజేశారు.

అంబికా.. మీ తపన బాగుంది..

'ఎంపీగా ఎన్నికైన తక్కువ సమయంలోనే ఎక్కువగా కష్టపడ్డారు. ప్రజల కోసం మీరు పడే తపన బాగుంది..' అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సుమన్ అభినందించారు. ఎంపీని ఆయన నివాసంలో కలిశారు. 'మీరు గెలిచిన వెంటనే ఒకసారి మాట్లాడించాను. మీరు పడుతున్న శ్రమను చూసి.. ఒకసారి తప్పకుండా కలవాలనిపించి వచ్చాను' అని అంబికాతో సుమన్ అన్నారు. ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నారని, హాస్పిటల్ అభివృద్ధి పనులకు రూ.కోటి వరకూ కేటాయించడం అభినందనీయమని అన్నారు. సుమన్‌ను అంబికా ఘనంగా సత్కరించారు. సుమన్‌తో ఫొటోలు తీసుకునేందుకు అభిమానులు పోటీపడ్డారు.

శిక్షణలోనే సంపాదన

స్ఫూర్తిదాయకంగా గుడ్డ సంచుల తయారీ

ప్లాస్టిక్ నియంత్రణ.... పర్యావరణ పరిరక్షణ

ఆదర్శంగా నిలుస్తున్న 'అనంత' మహిళలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జీవనోపాధుల పెంపునకు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను అందిపుచ్చుకున్న అనంత మహిళలు కార్యసాధకులుగా నిలుస్తున్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రభుత్వం చేస్తున్న ఉద్యమంలో తాము సైతం అంటూ అనంత మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు బట్టసంచుల తయారీకి శ్రీకారం చుట్టారు. బీసీ కార్పొరేషన్, అనంత నగరపాలక సంస్థ పరిధిలోని మెప్మాకు సామాజిక సేవకుడు ఏజీ అనిల్‌కుమార్ సహకారం అందిస్తున్నారు. మెప్మాలోని సత్యసాయి ఐక్య సంఘం ఆధ్వర్యంలో నగరంలో చీరలతో బట్ట సంచుల తయారీకి చీరలు అందిస్తున్నారు. దాంతో పాటు ఒక్కో సంచికి రూ.10చొప్పున కుట్టేందుకు చెల్లిస్తూ...ఇప్పటి వరకు సుమారు లక్షకు పైగా బట్ట సంచులను తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సుమారు 5వేల బట్ట సంచులు ఉచితంగా పంపిణీ చేశారు. శిక్షణలోనే ఒక్కో మహిళ నెలకు రూ.15వేల వరకు సంపాదిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత సర్టిఫికెట్, ఉచితంగా కుట్టు మిషన్ అందుకోనున్నారు. ఈ కుట్టు శిక్షణ కేంద్రాన్ని మెప్మా రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శంగా చూపిస్తోంది.

సంయుక్తంగా గుడ్డ సంచుల తయారీ



ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థ సహకారంతో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించాం. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, మెప్మా, బీసీ కార్పొరేషన్, పర్యావరణ సేవకుడు అనిల్‌కుమార్ ప్రోత్సాహంతోనే విజయవంతంగా స్వయం ఉపాధి కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశాం. ఇందులో 135 మంది మహిళలు శిక్షణ పొందుతూ, స్వయం ఉపాధి కింద నెలకు రూ.15వేలు వరకు సంపాదిస్తున్నారు. బట్ట సంచుల తయారీతో ఓ వైపు మహిళకు ఉపాధి, మరోవైపు ప్లాస్టిక్ నిర్మూలనతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నాం.

-సరస్వతి, అధ్యక్షురాలు, సత్యసాయి ఐక్యసంఘం



కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలు

చీరలతో సంచుల తయారీ

చీరలతో బట్ట సంచులను (బ్యాగ్) తయారు చేస్తూ...స్వయం ఉపాధి పొందుతున్నారు. ఏజీ అనిల్‌కుమార్ చీరలు అందిస్తున్నారు. ఒక్కో చీరకు 12 బ్యాగులు తయారు చేస్తున్నారు. ఒక్కో బ్యాగ్‌కు రూ.10 ఆయన చెల్లిస్తున్నారు. నగరంలోని సత్యసాయి ఐక్యసంఘం ద్వారా బీసీ కార్పొరేషన్, నగరపాలక సంస్థ మెప్మా సంయుక్తంగా కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో 135 మంది డ్వాక్రా సంఘాల మహిళలు శిక్షణ పొందుతున్నారు. శిక్షణ కాలంలోనే ఒక్కో మహిళ నెలకు రూ.15వేల వరకు సంపాదిస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఏజీ అనిల్ కుమార్, మెప్మా పీడీలు అందిస్తున్న సహకారంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని బట్టసంచుల తయారీని ప్రోత్సహించారు. డిప్యూటీ కమిషనర్ తల్లి సుమారు 50 చీరలు అందజేశారు.



తాము కుట్టిన గుడ్డ సంచులను చూపుతున్న మహిళలు

కుటుంబానికి తోడ్పాటు



ప్రభుత్వం అవకాశం కల్పించడంతో కుట్టు శిక్షణతో నెలకు వేతనం వస్తోంది. దీంతో కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాడు ఇస్తున్నాను. మహిళలు చాలా ఆసక్తిగా కుట్టు శిక్షణ నేర్చుకుంటున్నారు. శిక్షణతో పాటు ఉపాధి మార్గాలు కూడా ఇక్కడే ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. బట్ట సంచుల తయారీతో మాకు ఉపాధి లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్నాం. **-నాగేశ్వరి, కుట్టు శిక్షకురాలు**

శిక్షణలోనే ఉపాధి



ప్రభుత్వం కుట్టులో శిక్షణ ఇస్తోందని మహిళా సంఘం ద్వారా తెలుసుకున్నాను. శిక్షణ మాత్రమే ఇస్తారనుకున్నాం. శిక్షణతో పాటు ఇక్కడే స్వయం ఉపాధి కూడా కల్పిస్తున్నారు. గృహిణిగా ఖాళీగా ఉండే నాకు ప్రతి నెలా రూ.15వేలు సంపాదించే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. మెప్మా, శిక్షణ నిర్వాహకులు, అనిల్‌కుమార్ ప్రోత్సాహం మరువలేనిది.

-నాగజ్యోతి, శిక్షణ పొందుతున్న మహిళ

ఆఫ్‌లైన్ అనుమతులు నేరం

- అనధికార లే అవుట్లపై క్రిమినల్ చర్యలు
- జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వ్యవస్థ ఉన్నప్పటికీ కొందరు పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికీ ఆఫ్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తున్నారని, ఇది నేరమనీ, అలాంటివి చెల్లవని జాయింట్ కలెక్టర్, అహుడా ఇన్‌చార్జి వైస్‌చైర్‌పర్సన్ శివనారాయణ శర్మ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు, డీఎల్పీఓలతో పంచాయతీల పరిధిలో 'ఆన్‌లైన్ విధానంలో భవన నిర్మాణ అనుమతులు, అనధికారిక లేఅవుట్లపై చర్యలు' అనే అంశంపై జేసీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. అహుడా పరిధిలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ మరింత వేగంగా చేపట్టాలని ఆదేశించారు. అనధికార లేఅవుట్లు వేసి ప్రజలను మభ్యపెడుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న రియల్టర్లు, భూయజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కేఎండీ ఇషాక్ పాల్గొన్నారు.

రేపు పామిడిలో పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను ఈనెల 7వ తేదీన పామిడిలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. పామిడిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు సమస్యలపై అర్జీలు ఇవ్వొచ్చన్నారు.

కమిటీ సభ్యుల నియామకం...

జిల్లా ఆహార సలహా కమిటీ, జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా పలువురిని నియమిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి రామకృష్ణుడు, రాయలసీమ జాగృతి ఫౌండేషన్ చైర్మన్ శ్రీహరిమూర్తి, హెచ్ఎంటీవీ స్టాఫర్ ప్రవీణ్‌కుమార్, రెడ్స్ భానుజాను నియమించారు. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

క్రైం కార్నర్

బైకును ఢీకొట్టిన బొలెరో

● ఇద్దరి దుర్మరణం ● పీర్లను చూసేందుకు వెళ్తుండగా ప్రమాదం



ప్రమాద స్థలంలో మృతదేహాలు, గుమిగూడిన జనం

బత్తలపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని బైపాస్ రోడ్డుపై శనివారం ద్విచక్రవాహనాన్ని బొలెరో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంటాపురం గ్రామానికి చెందిన ఓబులేసు(42) గుమ్మల్ల కుంటకు చెందిన సదాశివ(30) మృతిచెందారు. ఖాసీం స్వామి గ్రామోత్సవంలో భాగంగా పీర్ల వేల్పుమడుగుకు వెళ్తుండటంతో చూసేందుకు ఓబులేసు బైక్‌పై బయల్దేరాడు. అక్కడే ఉన్న సదాశివ తాను కూడా వస్తానని బైక్‌పై కూర్చున్నాడు. వెల్పుమడుగు క్రాస్ వద్దకు రాగానే అనంతపురం నుంచి ముదిగుబ్బ వైపు వెళ్తున్న బొలెరో వాహనం వారిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న మృతుల కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు. ఎస్ఐ సోమశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాలను ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి హరీష్‌బాబు ధర్మవరంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబాలను ఓదార్చారు. ఓబులేసుకు భార్య ఇద్దరు కుమారులు, సదాశివకు భార్య, కుమారుడు ఉన్నారు.

అమ్మను కొడుతున్నాడని..!

తండ్రిని చంపిన తనయుడు



పెద్ద గంగయ్య మృతదేహం

నార్పల, జూలై 5(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి, తన తల్లిని నిత్యం హింసిస్తున్న తండ్రిని కుమారుడు కడతేర్చాడు. నార్పల మండల కేంద్రంలో శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. నార్పల అంబేడ్కర్ కాలనీకి చెందిన పెద్ద గంగయ్య(54), లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారులకు వివాహమైంది. కూలి పనులు చేసుకుంటూ, ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్నారు. పెద్ద గంగయ్య మద్యానికి బానిసయ్యాడు. తాగి వచ్చి రోజూ భార్యను హింసించేవాడు. ఈ క్రమంలో శనివారం అతిగా మద్యం సేవించి వచ్చి, భార్య లక్ష్మీదేవిని చితకబాదాడు. దీన్ని గమనించిన చిన్న కొడుకు చిన్న కృష్ణయ్య తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. రోకలి బండ తీసుకుని తండ్రిపై దాడి చేశాడు. దీంతో పెద్ద గంగయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

మొక్కజొన్న కొని డబ్బులివ్వలేదని కేసు

యాడికి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నపంట కొనుగోలుచేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి సంతోష్‌కుమార్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు హైదరాబాద్‌కు చెందిన ఏ. సంతోష్‌కుమార్ తనకు శ్రీ చంద్రాల పరమేశ్వర ట్రేడర్స్ ఆల్ పౌల్ట్రీ ఇంగ్రిడియన్స్ అండ్ రా మెటీరియల్స్ సంస్థ ఉన్నదని చెప్పాడు. దానికి సంబంధించిన విజిటింగ్ కార్డును వాట్సాప్‌లో యాడికి మండలం తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన నూతల సాయి కల్యాణ్‌కు పంపాడు. మాయమాటలు చెప్పి 14లారీల మొక్కజొన్న పంటను ఆయన ద్వారా కొనుగోలు చేశాడు. అందుకు అయిన మొత్తం రూ.1,28,14,340 గాను రూ.68,26,080 ఇచ్చి మిగతా డబ్బు ఇవ్వకుండా మోసం చేశాడు. దీనిపై నూతల సాయి కల్యాణ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుట్టపై వైసీపీ గద్దలు..!

జగనన్న లే అవుట్‌కు గుట్టలో మట్టి తవ్వకాలు

అదే స్థలం దర్జాగా కబ్జా

బోర్డు పాతి.. చేతులు దులుపుకున్న అధికారులు



ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

గుత్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): గుట్టపై వైసీపీ గద్దలు వాలాయి. పట్టణంలో అనంతపురం రహదారికి పక్కనే ఉన్న ఖరీదైన గుట్టను మింగేస్తున్నాయి. గత వైసీపీ హయాంలో జగనన్న కాలనీకి గుట్టలో మట్టి తవ్వి, తరలించారు. ఆ తర్వాత అదే గుట్టపై కన్నేశారు. వైసీపీ నాయకులే పంచేసుకుని, ప్లాట్లు వేసుకున్నారు. కొందరు నిర్మాణాలు కూడా చేపట్టారు. ప్రధాన రహదారి పక్కనే ఈ కబ్జా పర్వాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నా.. అధికారులు కళ్లు మూసుకున్నారు. గుట్టలో ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పాతి, చేతులు దులుపుకున్నారు. దీంతో ప్రభుత్వం మారినా వైసీపీ కబ్జాదారులకు అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



గుట్టలో అక్రమ కట్టడాలు

మట్టి తోలి..

మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వం పేదలకు సెంటు స్థలం కేటాయిస్తూ జగనన్న కాలనీలు నిర్మించాలని నిర్ణయించుకుంది. దీనిని వైసీపీ నేతలు అవకాశంగా మలచుకున్నారు. జగనన్న కాలనీలో మౌళిక వసతుల కల్పన మాటున దోపిడీకి తెరలేపారు. పట్టణంలోని అనంతపురం రోడ్డు పక్కనే సర్వే నంబరు 590లోని గుట్టను తవ్వి జగనన్న కాలనీలో రోడ్ల ఏర్పాటుకు మట్టిని తరలించారు. ఓ వైసీపీ నేత మట్టిని తరలించాడు. మట్టి తరలింపునకు లక్షల్లో బిల్లులు దండుకున్నారన్న ఆరోపణలున్నాయి. మట్టి తరలింపుతో చదునైన గుట్టపై వైసీపీ నాయకుల కన్ను పడింది. రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి అర ఎకరా మేర ఆక్రమించారు. ఇక్కడ సెంటు భూమి రూ.3 లక్షల వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన కబ్జా చేసిన భూమి విలువ రూ.కోటిన్నర ఉంటుంది. కబ్జాచేసిన ఆ భూమిలో కొంతమంది పునాదులు వేసుకోగా.. మరికొంతమంది విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జా అవుతున్నా సంబంధిత అధికారులు బోర్డులు పాతి చేతులు దులుపుకున్నారు. అలా.. కబ్జాదారులకు పరోక్షంగా అధికారులు సహకరించారన్న విమర్శలున్నాయి. బోర్డు పాతిన ఆ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోకపోవడం శోచనీయం. ప్రభుత్వం మారినా అధికారులు.. వైసీపీ నాయకులకే వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు బోర్డుపాతిన స్థలాలను స్వాధీనం చేసుకుని, పేదలకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్వాధీనం చేసుకుంటాం: పుణ్యవతి, తహసీల్దార్, గుత్తి

బోర్డు పాతిన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుంటాం. ఆ స్థలంలో ఎవరైనా నిర్మాణాలు చేపట్టివుంటే నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకుంటాం.

విజ్ఞాన సమాజ నిర్మాణమే లక్ష్యం

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



క్షీరాభిషేకం చేస్తున్న తల్లులు

రాయదుర్గం, జూలై 5(ఆంధ్రజ్యోతి): విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని 6, 9 వార్డుల పరిధిలో తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధిపొందిన తల్లులు శనివారం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతాభివందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఈక్రమంలోనే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఏడాదిలోపే నియోజకవర్గానికి 27 ఉన్నత పాఠశాలలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. వీటితో పాటు ప్రైమరీ మోడల్ స్కూల్స్ కూడా మంజూరు చేశారన్నారు. పట్టణ పరిధిలో వైసీపీ ప్రభుత్వం గతంలో 3812 మంది విద్యార్థులకు రూ. 4.95 కోట్లు అమ్మఒడి కింద మంజూరు చేసిందన్నారు. అదే కూటమి ప్రభుత్వం 8481 మంది విద్యార్థులకు రూ.11.02 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రతి కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 13 వేలు చొప్పున వారి తల్లుల అకౌంట్‌లో జమ చేశామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజల్లోకి వెళ్లినపుడు ప్రతి చోటా పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆనందంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారో నేరుగా సంబంధిత ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడి తెలుసుకోటానికి వీలుగా ఈనెల 10న మెగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పొరాళ్ల పురుషోత్తం, వార్డ్ ఇన్‌చార్జ్ గౌరీలు పాల్గొన్నారు.

ఒక్కరు కూడా చేరలేదా..?

● రాష్ట్ర బృందం విస్మయం



మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ బృందం

అనంతపురం విద్య, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 57 ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరకపోవడంపై రాష్ట్రకమిటీ బృందం విస్మయం వ్యక్తం చేసింది. రాష్ట్ర బృందం రెండోరోజు జిల్లాలో పర్యటించింది. ఐదు బృందాలుగా విడిపోయి, ఒక్కో బృందం ఒక్కో ప్రాంతానికి వెళ్లి పాఠశాలలను తనిఖీ చేసింది. గ్రామంలో పర్యటిస్తూ అక్కడ ప్రజలతో మాట్లాడుతూ బడిఈడు పిల్లలు ఎందరు ఉన్నారు? ఉంటే ఊర్లో ఉన్న బడిలో ఎందుకు చేరలేదు? తదితర వివరాలను ఆరా తీశారు. పాఠశాల ఎలా ఉంది? అక్కడ టీచర్లు ఎంతమంది ఉన్నారు? వారి పనితీరు, వసతులు గురించి పరిశీలించి ఫొటోలు తీసుకున్నారు. మరో మూడురోజులుపాటు జిల్లాలోనే ఉంటూ జీరోఎన్‌రోల్ ఉన్న 57 పాఠశాలలను తనిఖీ చేసి నివేదికలను తయారు చేసి, విద్యాశాఖ కమిషనర్‌కు అందజేయనున్నట్లు బృందం సభ్యులు మల్లికార్జునరావు తెలిపారు.

సదరం సర్వర్ డౌన్

● నేటితో ముగియున్న స్లాట్ బుకింగ్



సర్వర్ డౌన్ కావడంతో నిరీక్షిస్తున్న మహిళలు

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ ఆధారిత వైకల్య ధ్రువీకరణ పత్రం కోసం స్లాట్ బుక్ చేసే సదరం సర్వర్‌డౌన్ కావడంతో బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శని, ఆదివారం స్లాట్ బుకింగ్‌ను ఓపెన్ చేశారు. అయితే తొలిరోజైన శనివారం ఉదయం ఒక గంట సమయం సర్వర్ పనిచేసింది. అనంతరం డౌన్ కావడంతో బాధితులు రాత్రివరకు సచివాలయాల్లో బారులు తీరారు. ఆదివారంతో స్లాట్‌బుకింగ్ గడువు ముగిసిపోతుందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. సదరం ప్రక్రియను పర్యవేక్షించే డీసీహెచ్ఎస్, సర్వజన వైద్యశాల అధికారులు స్పందించి సమస్యను చక్కదిద్దాలని వేడుకుంటున్నారు. స్లాట్ బుకింగ్ క్లోజ్ అయితే తిరిగి ఎప్పుడు ఓపెన్ చేస్తారో తెలియదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా భూగర్భగనుల శాఖ అధికారిగా ఆదినారాయణ



అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లా భూగర్భగనుల శాఖ అధికారిగా ఆదినారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ భూగర్భ గనుల శాఖ రాష్ట్ర డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారిగా ఉన్న వెంకటేశ్వర్లును అవినీతి, ఆరోపణల నేపథ్యంలో రాజధాని అమరావతిలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అనంతపురం జిల్లా భూగర్భగనుల శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ జియాలజిస్టుగా ఉన్న డి.ఆదినారాయణకు ఇన్‌చార్జి డీఎంజీఓగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శనివారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం స్థానిక హెచ్చెల్సీ కాలనీలో ఉన్న కార్యాలయంలో ఆదినారాయణ బాధ్యతలు స్వీకరించారు.

మొక్కలు నాటడాన్ని విజయవంతం చేయండి

అనంతపురం అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 8వతేదీన చేపట్టే మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పిలుపునిచ్చారు. విజయవాడ నుంచి శనివారం ఆయన పంచాయతీరాజ్ డైరెక్టర్ కలిసి అన్ని జిల్లాల పీడీలు, ఏపీడీలు, ఏపీఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీమ్ బాషా, ఏపీడీ విజయ్‌కుమార్, ఏపీఓలు పాల్గొన్నారు.

నాటుసారా అమ్మితే జైలుకే: డీసీ

అనంతపురం క్రైం/బెళుగుప్ప, జూలై 5(ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసి, విక్రయిస్తే పీడీ చట్టం ప్రయోగించి, జైలుకు పంపుతామని ఉమ్మడి జిల్లా జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, అనంతపురం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలిసి శనివారం ఆయన జిల్లాలో పర్యటించారు. బెళుగుప్పలో నవోదయం 2.0పై గ్రామ సభ నిర్వహించారు. నాటుసారా నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించారు. తర్వాత డీసీ నాగమద్దయ్య మాట్లాడుతూ.. సారా తయారుచేసినా, అమ్మినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. సారా తాగడం ప్రాణాలకు ముప్పు అని, ఆరోగ్యం పాడవుతుందన్నారు. అనంతరం కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉండే కర్ణాటక సరిహద్దు గ్రామాల్లోకి కర్ణాటక మద్యం రాకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, ఎక్సైజ్ డీటీఎఫ్ జయనాథరెడ్డి, కళ్యాణదుర్గం ఎక్సైజ్ ఎస్ఐలు సుధాకర్, శంకర నారాయణ, ఇతర సిబ్బంది నరసరాజు, ప్రతాప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కువైట్‌లో ఉద్యోగావకాశాలు

అనంతపురంరూరల్, జూలై5(ఆంధ్రజ్యోతి): కువైట్ దేశంలో నిర్మాణ రంగ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) కార్యనిర్వాహక డైరెక్టర్ మనోహర్, జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఓఎంసీఏపీ, దట్ రుయా సంస్థతో కలిసి కువైట్ దేశంలో నిర్మాణరంగ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. 24 నుంచి 50ఏళ్లలోపు వయసు పురుషులు అర్హులన్నారు. సెరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ పనుల్లో ఐటీఐ, డిప్లొమా చేసిన, 3 నుంచి ఐదేళ్ల అనుభవం గలవారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9988853335 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు: జేడీ

అనంతపురం అర్బన్, జూలై5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలోని పశువైద్యశాలల్లో కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్ ప్రకటనలో పేర్కొన్నారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే రేబిస్, ఆంత్రాక్స్ బ్రుసెల్లోసిస్, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ తదితర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాలోని అన్ని పశువైద్యశాలలకు ఇప్పటికే 19,980 డోస్‌ల రేబిస్ టీకాలు పంపామన్నారు. రేబీస్ లాంటి ప్రాణాంతక వ్యాధులు కుక్కల నుంచి మనుషులకు సంక్రమిస్తాయన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని, పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబీస్ టీకాలు వేయించాలని సూచించారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్,జూలై5(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు (గ్రైరంగాలు) టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరిగా రూ.15వేలకు విక్రయాలు జరిగాయన్నారు. ఇక సీజనల్ రకం కాయలు టన్ను గరిష్ఠంగా 15వేలు, కనిష్ఠంగా రూ.4,200, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 887 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఆశా పోస్టుకు 83 దరఖాస్తులు..!

గుంతకల్లు, అనంతపురంలో తీవ్ర పోటీ

అనంతపురం వైద్యం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్త పోస్టుకు తీవ్ర పోటీ ఏర్పడింది. గుంతకల్లులోని 13వ సచివాలయ ప్రాంత పోస్టుకు ఏకంగా 83 దరఖాస్తులు రావడం విశేషం. గతనెల 25న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ జారీచేసిన నోటిఫికేషన్ ద్వారా నిరుద్యోగ మహిళలు వారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పెద్దసంఖ్యలో ముందుకొచ్చారు. గత నెల 30వ తేదీతో గడువు ముగిసింది. మొత్తం 58 పోస్టులకు ఏకంగా 780 దరఖాస్తులు రావడం విశేషం. 11 పోస్టులకు తీవ్రపోటీ నెలకొంది. ఒక్కో పోస్టుకు 20నుంచి 83 దరఖాస్తులు వచ్చాయి.

పోటీ తీవ్రం..

ఆశా కార్యకర్త పోస్టుల విషయంలో అనంతపురం, గుంతకల్లు మధ్య పోటీ నెలకొంది. అనంతపురంలోని 2వ రోడ్డు ప్రాంతం ఆశా కార్యకర్త పోస్టుకు 75, శ్రీనగర్ కాలనీకి 48, మిస్సమ్మ కాలనీకి 44 దరఖాస్తులు వచ్చాయి. గుంతకల్లులోని 13వ సచివాలయ ప్రాంత పోస్టుకు ఏకంగా 83 దరఖాస్తులు రావడం విశేషం. ఇదే అత్యధికం కావడం గమనార్హం. 32వ వార్డుకు 45, ఆచారమ్మ కొట్టాలకు 40 దరఖాస్తులు వచ్చాయి. గుత్తి సీపీఐ కాలనీ-3కి 35, రాయదుర్గం 1వ సచివాలయానికి 34 మంది. యర్రగుంటపల్లి-1కి 28, నారాయణపురం-5కి 22, శెట్టూరు 21 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

ఆ రెండిటికీ ఖరారు

మొత్తం 58 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీలో కణేకల్లు మండలం యర్రగుంట ఆరోగ్యకేంద్రం పరిధిలోని పుల్లంపల్లి, కొత్తపల్లికి ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చింది. ఈ లెక్కన ఆ రెండిటికి పోటీనే లేదు. దరఖాస్తు చేసుకున్న వారికి పోస్టులు ఖరారైనట్లే. ఏ.కొండాపురం, కందుకూరు-2 పోస్టులకు ఇద్దరు చొప్పున మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఆరు చొప్పున కేంద్రాలకు మూడు, నాలుగు, ఐదు చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

పన్నుల శాఖ జేసీగా హేమ

● డీసీతో పాటు సీటీఓలు, డీసీటీఓలు బదిలీ

అనంతపురం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్(జేసీ)గా ఇందుకూరి హేమను నియమించారు. ఈమె విజయవాడ-3 సర్కిల్ జేసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ జేసీగా పని చేస్తున్న శేషాద్రిని విశాఖపట్నం సర్కిల్-1, సర్కిల్-2(ఎఫ్ఏసీ)కు బదిలీ చేశారు. డిప్యూటీ కమిషనర్ అంబటి మురళీమనోహర్ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం డీసీగా ఉన్న భాస్కరవల్లి పెనుమాళను నియమించారు.

దగ్గర దగ్గరకే...

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో సీటీఓల బదిలీలు జరిగాయి. అయితే అనంతపురం-1 సీటీఓ సోనియాతార సమీపంలోని తాడిపత్రికి, తాడిపత్రి సీటీఓ సురేంద్రరెడ్డి హిందూపురానికి బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఇక డీసీటీఓల బదిలీలు మరీ ఘోరం. పక్క పక్క సర్కిళ్లకే మార్చేసుకుని వ్యవహారం నడుపుకున్నా రనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హిందూపురం సర్కిల్‌లో పలువురు ఏసీటీఓలు, మిగిలిన ప్రాంతాల్లో సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల బదిలీలు జరిగాయి.

డీసీటీఓల బదిలీలు...

అనంతపురం-2 సర్కిల్ నుంచి డీసీటీఓ సుజాతను అనంతపురం1కు, తాడిపత్రి డీసీటీఓ భరత్‌మోహన్ అనంతపురం-1కు బదిలీ చేశారు. అనంతపురం-1నుంచి శ్రీనివాసులు అనంతపురం-2కు బదిలీ అయ్యారు. పుట్టపర్తి నుంచి సురేష్‌కుమార్‌ను, చిత్తూరు డీసీటీఓ శివమోహన్‌రెడ్డిని కళ్యాణదుర్గం సర్కిల్‌కు బదిలీ చేశా రు. కర్నూలు డీసీటీఓ అమర్‌నాథ్‌రెడ్డిని, తిరుపతి డీసీటీఓ ఎం.శ్రీనివాసులును తాడిపత్రికి బదిలీ చేశారు. తిరుపతి డీసీటీఓ శ్రీనివాసులును గుంతకల్లు సర్కిల్‌కు కేటాయించారు. కళ్యాణదుర్గం డీసీటీఓ(ఇన్‌చార్జ్ సీటీఓ) హరినాథ్, నంద్యాల డీసీటీఓ ప్రభాకరరెడ్డి, తాడిపత్రి డీసీటీఓ బి.శ్రీనివాసులు హిందూపురం సర్కిల్‌కు బదిలీ చేశారు. పుట్టపర్తి డీసీటీఓ శ్రీనివాసులరెడ్డిని కడప-1 కు, అనంతపురం-1 సర్కిల్ డీసీటీఓ వెంకటరమణను ఆదోనికి, కళ్యాణదుర్గం డీసీటీఓ ను దర్శనంను నంద్యాల-1కు బదిలీ చేశారు.

సీటీఓల బదిలీలు...

అధికారి పేరు	ప్రస్తుతస్థానం	బదిలీస్థానం
సోనియాతార	అనంతపురం-1	తాడిపత్రి
పెద్దేటి నరసింహులు	అనంతపురం-2	మార్కాపురం
మౌనిక	మదనపల్లి	అనంతపురం-1
కూన రాకేష్	కాకినాడ	అనంతపురం-2
సుజిత	నంద్యాల-2	కళ్యాణదుర్గం
చందు	గుడివాడ	పుట్టపర్తి
సురేంద్రరెడ్డి	తాడిపత్రి	హిందూపురం

హెచ్చెల్సీ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

కంప్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం కింది భాగాన ఉన్న కుడికాలువ (హెచ్చెల్సీ)ని శనివారం అనంతపురం జిల్లా నీటి పారుదల శాఖ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, తుంగభద్ర బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్, మునరాబాద్ (టీపీసీ)ఎస్ఈ భరద్వాజ్, హెచ్చెల్సీ ఈఈ చంద్రశేఖర్ తదితరులు పరిశీలించారు. హెచ్చెల్సీ కాలువ చివర నుంచి జలాశయం వరకు పరిశీలించారు. ఈ నెల 10న జలాశయం నుంచి నీరు విడుదల చేయనుండంతో కాలువలోని యూటీయూలు, డీప్ కట్‌లు డిస్ట్రిబ్యూటర్ జలాశయంపైన జరుగుతున్న క్రస్ట్ గేట్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువను పరిశీలించిన తర్వాతే నీటిని విడుదల చేస్తామన్నారు. వారితో పాటు ఎస్‌డీవోలు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ప్రసన్న కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు, రేపు తొలి ఏకాదశి వేడుకలు

పుట్టపర్తి రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జగరాజుపల్లి వద్ద ఓబులేసుడి కొండపై వెలసిన ఓబులేశ్వరస్వామి సన్నిధిలో తొలి ఏకాదశి (ఆషాఢ శుద్ధ ఏకాదశి) వేడుకలు ఆది, సోమవారాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సమీప గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని, తీర్థప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు. రెండురోజులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

10న గురుపౌర్ణమి

ధర్మవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌లో వెలసిన షిర్డీసాయిబాబా ఆలయంలో ఈ నెల 10న గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్టు ఆలయ సేవా సమితి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10న గురువారం ఉదయం 8గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పాదదర్శనానికి అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే ఉదయం 7గంటల నుంచి రాత్రి 9గంటలవరకు సాయినామ సంకీర్తన చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి అన్నదానం నిర్వహిస్తామని వారు తెలిపారు. 11న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి షిర్డీసాయినాథుడికి లక్ష కుసుమార్చన నిర్వహిస్తామన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: ఏడీఏ

తనకల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫర్టిలైజర్ దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధికంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ సనావుల్లా హెచ్చరించారు. తనకల్లులోని వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఎరువుల దుకాణ యజమానులతో ఏఓ భారతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎరువుల దుకాణదారులు రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు, పిచికారి మందులు విక్రయించాలన్నారు. ఏఈఓ ప్రశాంతి, సిబ్బంది, దుకాణదారులు పాల్గొన్నారు.

'విద్యార్థులు సమాజసేవను అలవరచుకోవాలి'



మాట్లాడుతున్న రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు

ధర్మవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సమాజ సేవను అలవరచుకోవాలని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు పేర్కొన్నారు. స్థానిక కేహెచ్ డిగ్రీ కళాశాలలో శనివారం రాజనీతి శాస్త్రం, ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌కు సంబంధించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చిట్టెమ్మ, అధ్యాపకులు గోపాల్‌నాయక్, త్రివేణి, పావని, హైమావతి, ఆనంద్, మీనా, ధనుంజయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.16,800 ఇవ్వాలని వినతి

ధర్మవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కరోనా కార్మికులు, అదనపు కార్మికులకు రూ.16,800 కనీస వేతనం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు కార్మికులు శనివారం వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం ఇవ్వాలని పలు మార్లు వినతిపత్రాలు అందించినా అధికారులు పట్టించుకోలేదని కార్మికులు పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా ఉందన్నారు. కావున జీతాల సమస్య పరిష్కరించాలని వారు కమిషనర్‌ను కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కార్మికులు బాబు, ముకుంద, లక్ష్మీఓబుళేశు, చెన్నకేశవులు, బాలమురళి, శ్రీనివాసులు, ముత్యాలమ్మ, పెద్దక్కలు ఉన్నారు.

చేనేత కార్మిక సంఘం పట్టణ కమిటీ ఎంపిక

ధర్మవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఏపీ చేనేత కార్మికసంఘం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అధ్యక్షుడిగా ఖాదర్ బాషా, కార్యదర్శిగా గుంపు హరికుమార్, కోశాధికారిగా వెంకటస్వామి, ఉపాధ్యక్షుడిగా రవిని ఎంపిక చేశారు. సభ్యులుగా సన్నప్పయ్య, నారా యణ స్వామి, అన్నంసూరి, శ్రీహరి, లోకేశ్, అల్తాఫ్, చౌడప్పను ఎంపికచేశారు.

ఫసల్ బీమాతో రైతుకు ధీమా: ఏఓ

అమడగూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): సాగుచేసిన పంట చేతికందే వరకు రైతుకు ఆందోళన తప్పదని, ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా పేరుతో రైతులకు ధీమా కల్పిస్తోందని ఏఓ వెంకటరమణాచారి తెలిపారు. ఈ బీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ నెల 15 వరకు బీమా ప్రీమియం చెల్లించవచ్చని తెలిపారు.

క్రీడాకారులకు ప్లేట్ల పంపిణీ

ధర్మవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో క్రీడాకారులకు షిర్డీసాయిబాబా ఆలయసేవా సమితి సభ్యులు స్టీల్ ప్లేట్లను శనివారం పంపిణీ చేశారు. ఆ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రోజూ సాయంత్రం క్రీడాకారులకు పౌష్టకాహారాన్ని అందజేస్తున్నారు. దీంతో ముదిగబ్బ మండలం మర్తాడు గ్రామంలో ఎస్జీటీగా పనిచేస్తున్న ధర్మవరానికి చెందిన వెలిగొండ్ల నాగరాజు క్రీడాకారుల కోసం రూ.6వేలు విలువ చేసే 70 స్టీల్ ప్లేట్లను ఏర్పాటుచేశారు. వాటిని సేవాసమితి సభ్యులు క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో హాకీ సత్యసాయి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గౌరీప్రసాద్, కోశాధికారి అంజనప్ప, జాయింట్ సెక్రటరీ అరవిందగౌడ్, చంద్రశేఖర్, మారుతీకుమార్ పాల్గొన్నారు.

సమస్యలు సృష్టిస్తే చర్యలు: ఎస్ఐ

తాడిమర్రి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బందులను గురిచేసేవిధంగా ఎవరు సమస్యలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ క్రిష్ణవేణి పేర్కొన్నారు. ఆమె శనివారం తెల్లవారుజామున తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లిలో నాకాబందీ నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించి గ్రామంలో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఘనంగా సహకార దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న సహకార కేంద్ర బ్యాంక్ సిబ్బంది

ఓబుళదేవరచెరువు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ వెంకటాచలం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మేనేజర్ ఆధ్వర్యంలో సహకార జెండాను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ రామమోహన్, సిబ్బంది ధర్మాచారి తదితరులు పాల్గొన్నారు.

పండుటాకులకు పని కల్పిస్తున్న వేప

● వేప గింజలతో పలువురికి ఆదాయం


ఆరబెట్టిన వేప గింజలు

తనకల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): పనిచేయడానికి అలవాటు పడిన నాటి తరం వారికి తినికూర్చోనే అలవాటు లేదు. ప్రభుత్వం నుంచి వృద్ధాప్య పింఛన్ అందుతున్నా.... నేడు ఏదో ఒక పనిచేస్తూ కాలం వెల్లతీయాలన్నది వారి ఆకాంక్షతో నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కాలానుగుణంగా దొరికే వేపకాయలను ఏరి, తద్వారా ఆదాయం పొందుతున్నారు. తనకల్లు మండలంలోని టి.సదుం గ్రామంలో 50 కుటుంబాల్లోని వయస్సు పైబడిన వృద్ధులు కాలానుగుణంగా దొరికే వేపకాయలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వారు రోజూ ఉదయం, సాయంత్రం గ్రామం చుట్టు ఉన్న వేప చెట్ల వద్దకు వెళ్లి కిందరాలిన వేప పండ్లను ఏరి ఇంటికి తీసుకొస్తారు. వాటిని నీటిలో నానబెడతారు. నాలుగురోజుల తరువాత నీటి నుంచి బయటకు తీస్తారు. వాటిని తొక్కి వేప గుజ్జును, పొట్టును తీసివేసి గింజలను శుభ్రం చేస్తున్నారు. ఆ గింజనలను బాగా ఎండపెట్టి బయటనుంచి వచ్చే వ్యాపారలకు కిలో రూ. 60 నుంచి 80దాకా ధరతో గ్రామంలోనే విక్రయిస్తున్నారు. ఇలా వారానికి ఒకసారి విక్రయిస్తూ, ఆ ఆదాయంతో తమ కుటుంబాలకు ఆసరగా నిలుస్తున్నారు. గ్రామంలోని 50 కుటుంబాలకు చెందిన 70మందికి దాకా వృద్ధులు ఈ పనిలో నిమగ్నం కావడం గమనార్హం. వేప విత్తనాలను కొనేందుకు కొక్కంటి క్రాస్, నల్లచెరువు ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు కూడా వాటిని చెన్నై మార్కెట్‌కు తరలించి అధిక లాభాలను గడిస్తున్నారు. చెన్నై మార్కెట్‌లో వేప నూనెను తీసి సబ్బులు, ఇతర క్రిమిసంహారక మందులు, ఎరువుల్లో ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే వేప పిండిని పంటల సాగులో ఉపయోగించడానికి విక్రయిస్తున్నట్లు సమాచారం. అలాగే ఇలా సేకరించిన వేప విత్తనాలను కొందరు నల్లచెరువు, కొక్కంటిక్రాస్‌కు తీసుకెళ్లి నూనె ఆడించి ఇళ్లలో దీపారాధనకు, వ్యవసాయంలో చీడపీడల నివారణకు వినియోగిస్తున్నట్లు వృద్ధులు తెలిపారు. వేప పిండిని సొంత పొలాలకు ఉపయోగిస్తున్నట్లు వృద్ధులు వివరించారు. గతంలో తమ గ్రామం వద్ద పెద్ద పెద్ద వేప వృక్షాలుండేవి. వాటిని భూ యజమానులు విక్రయించడంతో నేడు చిన్న మాన్లు ఉన్నాయని చెబుతున్నారు. గతంలో ఒకమాను కిందనే క్వింటాకు పైగా వేపక విత్తనాలు ఒకేసారి దొరికేవని, ప్రస్తుతం పలు చెట్ల వద్దకు తిరగాల్సి వస్తోందంటున్నారు. వేప గింజల సేకరణలో పోటీ ఏర్పడిందని తెలుపుతున్నారు. కావును ప్రభుత్వం కూడా ప్రభుత్వ భూములో వేపచెట్లను నాటించి కాపాడాలని వృద్ధులు కోరుతున్నారు.

వేప విత్తనాలతో ఆదాయం, ఆరోగ్యం



మేము ఖాళీగా తిని ఇంట్లో కూర్చోలేం. దీంతో గ్రామం చుట్టు ఉన్న వేప చెట్ల వద్దకు వెళ్లి వేపకాయలు సేకరిస్తున్నాం. వాటిని ఇంటి వద్ద నాలుగు రోజులు నానపెట్టి, శుభ్రం చేసి గింజలు తీస్తున్నాం. ఆ గింజలను ఆరపెట్టి విక్రయిస్తున్నాం. తద్వారా వచ్చే ఆదాయంతోపాటు మాకు ఆరోగ్యం కూడా కలుగుతోంది. అలాగే వృద్ధులందరం చెట్లకింద వేపకాయలు ఏరుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నాం. -మలికేసాబ్, టి.సదుం

ఇతర పనులకు వెళ్లలేం



మా గ్రామంలో 50 కుటుంబాలకు పైగా వేపకాయలను ఏరి, గింజలు తయారుచేసి విక్రయిస్తున్నాం. వృద్ధులైన తాము మరే ఇతర పనులకు వెళ్లలేం. స్వయంగా మేమే వేపయాయల ఏరే పని చేస్తున్నాం. దీని ద్వారా వచ్చే ఎంతో కొంత ఆదాయాన్ని కుటుంబానికి అందిస్తున్నాం. ఇతర గ్రామా ల నుంచి కూడా వృద్ధులు మా గ్రామానికి వచ్చి వేపకాయలు సేకరిస్తున్నారు. -అమీనాబీ, టి.సదుం

ఇంటింటికీ వెళ్లి అభివృద్ధిని వివరిద్దాం

● శిక్షణ కార్యక్రమంలో టీడీపీ నాయకులు


శిక్షణలో మాట్లాడుతున్న నాయకులు

ముదిగుబ్బ, జూలై 5(ఆంధ్రజ్యోతి): యేడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిద్దామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో శనివారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంపై హిందూపురం ట్రైనింగ్- కోఆర్డినేటర్ శివకుమార్ ఆధ్వర్యంలో మండలంలోని బూత్ కన్వీనర్‌లు, కో- కన్వీనర్‌లు, సెక్షన్- ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మార్కెట్ యార్డ్ నూతన డైరెక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్ చార్జ్ మహేష్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, టీడీపీ కన్వీనర్లు కరణం ప్రభాకర్, అశ్వత్థరెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, నాయకులు కోట్ల బాబి, చినగాని నరసింహ యాదవ్, పార్లమెంట్ అధికార ప్రతినిధి పురుషోత్తం గౌడ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు కోన రవికుమార్, సాంబశివనాయక్, నాయకులు నాగిరెడ్డి, సూర్య శేఖర్‌రాజు, జానీ, తుమ్మల సూరి, వెంకట్, నారాయణ, కర్ణ, రాధమ్మ, హేమలతాబాయి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారికి నెమలి అప్పగింత

ధర్మవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని మార్కెట్‌యార్డ్ వద్ద గోడ ఎగరడానికి ప్రయత్నిన్న నెమలిని శారదానగర్ వాసులు సరితాన్ షెక్షావలి, షేక్ షెక్షావలి పట్టుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ బాబయ్య, షేక్షావలి దానిని ఫారెస్టు బీట్ ఆఫీసర్ అక్కులప్ప అప్పగించారు. ఫారెస్టు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెమలిని అడవిలో వదలనున్నట్టు బీట్ ఆఫీసర్ తెలిపారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి: సీపీఐ

ముదిగుబ్బ/తనకల్లు/ఓబుళదేవరచెరువు/నల్లమాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ముదిగుబ్బ విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వినతిపత్రం అందించ డానికి విద్యుత్ అధికారులు అందుబాటులో లేకపోవడంతో, కార్యాలయం గోడకు అతికించా రు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలన్నారు. అలాగే తనకల్లు మండలంలో నికోటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నాలో సీపీఐ మండల కార్యదర్శి రెడ్డెప్ప, సహాయ కార్యదర్శి చౌడప్ప తదితరులు పాల్గొన్నారు. ఓబుళదేవ రచెరువులో సీపీఐ మండల కార్యదర్శి చలపతినాయుడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించి, ఆర్ఐ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నల్లమాడ తహసీల్దార్ కార్యాలయంలో సీపీఐ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ మనోజ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

హాస్టల్ మరమ్మతులకు రూ.40లక్షలతో ప్రతిపాదనలు

కొత్తచెరువు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో నల్లకొండ వద్ద 2014లో రూ.70లక్షల వ్యయంతో బీసీ బాలికల హాస్టల్ నిర్మించా. అయితే కొండ చివర ఉండటంతో బాలికలకు అనువుగా ఉండదన్న కారణంతో ఏడాదిగా నిరుపయోగంగా ఉంది. దీంతో కొందరు ఆకతాయిలు హాస్టల్ తలుపులు, స్విచ్‌లు తదితర సామాగ్రిని ఎత్తుకెళ్లారు. అయితే 'అద్దె భవనంలోనే బాలికల హాస్టల్' అన్న వార్తా కథనం ఇటీవల 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురి తమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పల్లెసింధూర రెడ్డి హాసల్ విషయాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ఆదేశించడంతో హాస్టల్ మరమ్మతుల కోసం రూ. 40లక్షల మంజూరుకు కలెక్టర్‌కు ఇటీవల అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే మరమ్మతులు జరిగినా అక్కడ బాలికలు ఉండేందుకు అనువుగా లేదనే భావన విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతోంది.

'ప్రతి ఒక్కరూ చదువుకోవాలి'

తనకల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): కులం పోవాలంటే ప్రతి ఒక్కరు తప్పకుండా చదువు కోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ పేర్కొన్నారు. 30యేళ్ల క్రితం ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో నలుగురితో కలిసి ఏర్పాటుచేసిన ఎమ్మార్పీఎస్ పోరాటాల ఫలితంగా నేడు ఎన్నో సాధించామన్నారు. ఆయన శనివారం మండలపరిధిలోని చీకటిమానుపల్లిలో స్థానిక నాయకులతో సమావేశమై మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు పలక ఆంజనేయులు, సీనియర్ దళిత నాయకుడు తోపు పారేసు, హర్షవర్దన్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న హరీశ్‌బాబు

ధర్మవరం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఓబులనాయుని పల్లిలో గడ్డం చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను బీజేపీ నియోజక వర్గ ఇన్చార్జి హరీష్‌బాబు శనివారం పరామర్శించారు. గడ్డం చంద్రశేఖర్ కుమారుడు అభిరామ్ కనకదుర్గమ్మ దర్శనార్థం విజయవాడ వెళ్లాడు, అక్కడ స్నానం చేసేందుకు కృష్ణానదిలోకి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ అభిరామ్ తల్లితండ్రులను ఫోన్లో పరామర్శించారు. వ్యక్తిగత సిబ్బందిని అక్కడికి పంపి అభిరామ్ మృతదేహాన్ని అంబులెన్సులో స్వగ్రామం చేరేలా ఏర్పాట్లు చేశారు. శనివారం మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతం అయ్యారు. బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి హరీశ్‌బాబు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన సాయం అందేలా చూస్తామని ఆయన తెలిపారు.


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కందికుంట


కొట్లపల్లిలో వృద్ధురాలితో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాటామంతి

ఏడాది పాలనపై ఇంటింటి ప్రచారం

కనీవిని ఎరుగని అభివృద్ధి: ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వం యేడాది పాలనలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి పనులు చేపట్టారని ఎమ్మెల్యే కందికుంట వెంటకప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ యేడాది పాలన సందర్భంగా పట్టణంలోని 29వార్డులో శనివారం నిర్వహించిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన ఇంటింటి కెళ్లి యేడాదిలో చేపట్టిన, అభివృద్ధి, సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరాతీశారు. వార్డులో ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించడానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు డైమండ్ ఇర్ఫాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, బాహుద్దీన్, సిరి బాబాయ్య, వైస్ చైర్మన్లు సుధారాణి, రాజశేఖరాచారి, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఆమె శనివారం మండల పరిధిలోని కొట్లపల్లిలో నిర్వహించిన సుపరి పాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. సంక్షేమ పథకాల పట్ల ప్రజల వద్ద నుంచి మంచి స్పందన కనిపిస్తోందన్నారు. గ్రామంలోని 90 ఏళ్ల వృద్ధురాలు చక్రమ్మ ఎంతో ఉల్లాసంగా తనతోపాటు ఇంటింటి కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అలాగే గ్రామంలో ఉన్న మండల పరిషత్ పాఠశాలను సందర్శించి రెండో తరగతి విద్యార్థులకు సైన్సు పాఠాన్ని బోధించారు. గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఇటీవల మరణించిన గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, రాచువారి పల్లి మాజీ సర్పంచు వెంకటేసు కుమారుడైన టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాంరెడ్డి, శ్రీరాంనాయక్, సామకోటి ఆదినారాయణ, పుల్లప్ప, నాగరాజు, మహేష్, వెంకటప్ప, కేశవ, మాజీ సర్పంచు నారా యణస్వామి, టీడీపీ కన్వీనర్లు మైలేశంకర్, శెట్టివారిపల్లి జయచంద్ర, గోపాల్‌రెడ్డి, మల్రెడ్డి, గంగాధర్, గంగాధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే జీవితం సుఖమయం

● సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు


లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి వెంకటేశ్వర్లు

ధర్మవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజీతోనే జీవితం సుఖమయంగా సాగుతుందని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయాధికారి నందిని పేర్కొన్నారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. పలు కేసులను రాజీచేశారు. మొత్తం 265 కేసులను పరిష్కరించినట్టు న్యాయాధికారులు తెలిపారు. ఇందులో సివిల్ కేసులు 2, క్రిమినల్ కేసులు 92, ఎక్సైజ్ కేసులు 29, ఎస్ఐ యాక్ట్ 12 కేసులు, పీఎల్‌సీ కేసులు 9, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌లోని కేసులు 121 మొత్తం 265 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఇందులో రూ.7,83,44 బ్యాంక్, జరిమానా, ఎక్సైజ్, ఎస్ఐ యాక్ట్ కింద వచ్చినట్లు తెలిపారు.

ఆవేశంతో అనర్థాలే: న్యాయాధికారి


కేసులను పరిష్కరించి అవార్డులను పంపిణీ చేస్తున్న న్యాయాధికారులు

కదిరి లీగల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): చిన్న, చిన్న విషయాలకు ఆవేశాలకు లోనైతే అనర్థాలు మాత్రమే మిగులుతాయని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి పేర్కొన్నారు. మరో న్యాయాధికారి పీ లోకనాథంతో కలసి స్థానిక కోర్టు అవరణంలో లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్, క్రిమినల్ కేసులతోపాటు, బ్యాంక్, ఎక్సైజ్ కేసులు, చెక్ బౌన్స్ తదితర కేసులను మొత్తం 675 పరిష్కరించినట్లు న్యాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప, ఏజీపీ శివప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి: ఎంపీడీఓ

నంబులపూలకుంట, జూలై 5(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ పార్థసారథి సూచించారు. తద్వారా సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రాము అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలి: ఎస్పీ


స్పెషల్‌బ్రాంచ్ పోలీసు సిబ్బందికి కిట్స్ అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొం దించుకోవాలని జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి ఎస్పీ వి.రత్న సూచించారు. స్పెషల్‌బ్రాంచ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అనుస రించాల్సిన విధులపై జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని ఫ్యాక్షన్ గ్రామాల సమాచారాన్ని ముం దస్తుగా తెలుసుకుని జిల్లా ఉన్నతాధికారులకు అందించాలన్నారు. జిల్లాలో మొహర్రం నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి గొడవలు జరుగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమష్టిగా విధులు నిర్వర్తించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి లెదర్‌బ్యాగ్ కిట్స్ అందజేశారు. సమావేశంలో స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాల సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, సోషియల్ మీడియా ఎస్సై మునిప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

నో బ్యాగ్ డే

ధర్మవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిషీ విద్యాలయంలో శనివారం నో బ్యాగ్ డే చేపట్టినట్టు డీన్ భాస్కర్ తెలిపారు. ప్రతి శనివారం విద్యార్థులకు వినోదాత్మక, క్రియాత్మక పద్ధతుల ద్వారా విద్య నేర్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఏఓ రవీంద్ర, ప్రిన్సిపాల్ కరణ్‌స్వరూపసింగ్, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు


హాకీ పోటీలకు ఎంపికైన ధర్మవరం క్రీడాకారులు

ధర్మవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సబ్ జూనియర్ మహిళల హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బంధనాధం సూర్యప్రకాశ్ తెలిపారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి14వ తేదీ వరకు జార్ఖండ్ రాజధాని రాంచిలో జరుగుతున్న 15వ జాతీయస్థాయి సబ్ జూనియర్ మహిళల హాకీ పోటీలు జరుగుతాయని తెలిపారు. ధర్మవరానికి చెందిన హాకీ క్రీడాకారులు మధురిమాబాయి, వైష్ణవి, వర్ష ఎంపిక కాగా కేరళ రాష్ట్ర జట్టుకు తలారి హేమ ఎంపికయ్యారన్నారు. వారిని సూర్యప్రకాశ్‌తోపాటు హాకీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవీశ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఉడుముల రామచంద్ర, గౌరీప్రసాద్ తదితరులు అభినందించారు.

రెండోరోజు కొనసాగిన ఈయూ ధర్నా


ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు

ధర్మవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ధర్నా ధర్మవరం ఆర్టీసీ డిపో ఎదుట రెండో రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఈయూ రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్ మాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ధర్నాలో ఈయూ డిపో కార్యదర్శి ముస్తాఫా, రీజనల్ జాయింట్ కార్యదర్శి బి. నరసింహలు, సిస్టం సూపర్‌వైజర్ సుధాకర్, డిపో అధ్యక్షుడు తిరుమలేశ్, ఏడీసీ టీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తొలి ఏకాదశికి ముస్తాబైన ఆలయాలు



దర్గా ఆంజనేయస్వామి ఆలయం

పెనుకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పండగ సందర్భంగా పట్టణంలోని దక్షిణ ముఖ ఆంజనేయస్వామి, దర్గా అంజనేయస్వామి ఆలయాలతోపాటు లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయాలు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. చెరువు రోడ్డులోని దక్షిణ ముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సోమవారం ద్వాదశిరోజున ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం ఉట్లపరుష నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొలువుదీరిన పీర్లు



బాబయ్య దర్గా వద్ద కొలువుదీరిన పీర్లు

పెనుకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): మొహర్రం పండగను పురస్కరించుకుని స్థానిక బాబయ్యస్వామి దర్గా సమీపంలో దర్గాపీఠాధిపతి తాజ్‌బాబా, కాబోయే పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా ఆధ్వర్యంలో పీర్లను కొలువుదీర్చారు. జిల్లాలోనే అతిపెద్ద పీర్లచావిడిగా పేరొందిన స్థానిక బడేదీవాన్‌ఖానాలో 72 పీర్లను కొలువుదీర్చి ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి అలావ్, పెద్ద సరికెత్తు, ఆదివారం పీర్లను ఊరేగించి స్థానిక బాబయ్య చెరువులో జలధి చేస్తారని సలావుద్దీన్‌బాబా తెలిపారు.

అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

గోరంట్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్దనున్న బెస్టు యూనివర్సిటీలో బోధనారంగంలో విశిష్ట సేవలందించిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు గురువందన అవార్డుల ప్రదానం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి విద్యావేత్త, రచయిత, డాక్టర్ జయరాంశెట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ కళాశాలకు చెందిన 12మంది ప్రిన్సిపాల్స్, 40మంది అధ్యాపకులను గుర్తించి, గురువందన అవార్డులను అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఉన్న పవిత్ర బంధాన్ని వివరిస్తూ, విద్యార్థుల భవిష్యత్‌ను రూపొందించడంలో దాని ప్రముఖ్యతను ఆయన వివరించారు. కార్యక్రమంలో వైస్‌చాన్సిలర్ అనురాధాదర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జైప్రకాష్, డైరెక్టర్ నితిన్‌సోమాన్సి, కాసర్ డీన్ రాంగోపాల్‌మోపూరి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

సోమందేపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీలో గురువారం అస్వస్థతకు గురైన విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు చేపట్టాలని శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందించారు. పెద్దన్న మాట్లాడుతూ.. కేజీబీవీలో ఇలాంటి సంఘటనలు గతంలో పలుమార్లు చోటుచేసుకున్నాయన్నారు. కలుషితనీరు, పరిసరాల అపరిశుభ్రత, నాణ్యతలేని భోజనం కారణంగా విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమిక నివేదికలో వెల్లడైందన్నారు. ఇందుకు కారకులైన వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

శరవేగంగా అన్న క్యాంటీన్ పనులు

పెనుకొండ టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.62 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. శనివారం రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పనులు పరిశీలించారు. త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గోరంట్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త లోకేశ్ నాయక్ కుటుంబానికి కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి శనివారం రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ముత్తరాయుని తండాలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో భాస్కర్‌నాయక్ కట్టెతో తలపై కొట్టడంతో లోకేష్‌నాయక్ శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. పేద వాడుకావడంతో అంత్యక్రియలు, శవ పరీక్షల ఖర్చులకోసం నగదు అందించారు. మాజీ కన్వీనర్ సోముశేఖర్, ఉత్తమరెడ్డి, నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అమరాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి భార్గవ్ సూచించారు. మండలంలోని హేమావతి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, బీసీ బాలుర వసతి గృహంలో శనివారం వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, తమ నివాసాలచుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రథమ చికిత్సల పెట్టెను బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేసినట్లు వార్డన్ వెంకటరమణ తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఆశా కార్యకర్త గీతమ్మ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో దున్నపోతు మృతి

అమరాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంకెర ఎస్సీ కాలనీలో విద్యుత్‌షాక్ గురై దున్నపోతు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు విద్యుత్ స్తంభం నుంచి నేలకు ఉన్న స్టే వైరును దున్నపోతు తాకడంతో షాక్‌కు గురై మృతిచెందినట్లు తెలిపారు.

అక్రమ మద్యం అమ్మితే చర్యలు: సీఐ

మడకశిర రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం, నాటు సారా అమ్మితే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగేష్‌బాబు హెచ్చరించారు. గొల్లహట్టి గ్రామంలో శనివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానం ఉన్న ప్రతి ఇంటిలో సోదాలు చేశారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అక్రమంగా కర్ణాటక మద్యం అమ్మకాలు, నాటు సారా తయారీ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. మట్కా, జూదం తదితర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు.

లేపాక్షి: హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో శనివారం గోపిందేవరపల్లి గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో చిల్లర దుకాణాలను, గతంలో మద్యం అమ్మి పట్టుబడిన వారి ఇళ్లను, అనుమానితుల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు. కార్యక్రమంలో లేపాక్షి పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథుడి రథయాత్ర

● దారిపొడవునా భక్తుల నీరాజనాలు
● వందలాది మంది హాజరు



పేట వీధిలో ముందుకు కదులుతున్న జగన్నాథుడి రథం

హిందూపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సుభద్ర, బలరాముడు, జగన్నాథుడు ఊరేగారు. పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ సమీపంలో నిర్మించతలపెట్టిన ఇస్కాన్ మందిరం స్థలం నుంచి రథయాత్ర ముందుకు సాగింది. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు భక్తిగీతాలపై నృత్యాలు చేశారు. డ్రమ్స్ కొడుతూ ముందుకు సాగారు. రిలయన్స్ పెట్రోల్‌బంక్, గురునాథ్ సర్కిల్ గాంధీ సర్కిల్ మీదుగా చిన్నమార్కెట్, బెంగళూరు రోడ్డుపై రథయాత్ర సాగింది. భక్తులు దారిపొడవునా మంగళహారతులు, కొబ్బరికాయలతో నీరాజనాలు పలికారు. దారి పొడవునా రంగులు ముగ్గులు పోసి రథానికి స్వాగతం పలికారు. ఇస్కాన్ ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ భక్తులను అనుగ్రహించేందుకు జగన్నాథుడు మన ఊరికొచ్చి దర్శనమిస్తున్నాడన్నారు. జగన్నాథుడు భక్తులను అత్యంత ప్రియులుగా భావించి తమ కష్టాలు తొలగించడానికి విగ్రహ రూపంలో ఉన్నారన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు, భక్తులు, అధికంగా పాల్గొన్నారు. డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో రాజగోపాల్‌నాయుడు, జనార్దన్, ఆంజనేయులు, కరీం, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.



రథం ముందు చిన్నారుల కోలాటం

విజన్ ప్లాన్ అమలుపై దృష్టి సారించాలి: మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిలో విజన్‌ప్లాన్ అమలుపై అధికారులు దృష్టిసారించాలని మంత్రి సవిత సూచించారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంత్రి, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో నియోజకవర్గ విజన్‌యాక్షన్‌ప్లాన్‌పై మండల అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పీ-4 స్ఫూర్తిని తీసుకొచ్చారని రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 15లక్షల బంగారు కుటుంబాలలో లక్ష కుటుంబాలను ఆగస్టు 15న చేయూత అందించే విధంగా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో 7,264బంగారు కుటుంబాలను ప్రభుత్వం గుర్తించిందని వారి అభివృద్ధికి ఏమిచేస్తే వారి జీవితాలు బాగుపడతాయో ఆచరణ సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సురేష్‌కుమార్, సీఐ రాఘవన్, టీడీపీ నాయకులు కేశవయ్య, శ్రీనివాసులు, నారాయణస్వామి, నాగరాజు, శ్రీరాములు, లక్ష్మీనారాయణరెడ్డి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పీ4 వద్దు.. సెల్‌ఫోన్ ముద్దు..!

పెనుకొండ టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విజన్-2047లో భాగంగా పీ-4పట్ల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పీ-4కన్నా సెల్‌ఫోన్ ముద్దు అన్నతీరులో మండల అధికారులు వ్యవహరిస్తున్నారు. శనివారం మంత్రి సవిత, ఆర్డీఓ, డీఎస్పీ అధికారుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ యాక్షన్‌ప్లాన్‌పై పలువురు సలహాలు, సూచనలు ఇస్తుంటే ఇన్‌చార్జి తహసీల్దార్ స్వాతి, పరిగి తహసీల్దార్ హసీనాసుల్తానా, గోరంట్ల తహసీల్దార్ మారుతి ఇతర అధికారులు సెల్‌ఫోన్ చూసుకుంటూ అందులో నిమగ్నమయ్యారు.



సెల్‌ఫోన్లతో బిజీగా ఉన్న అధికారులు

టీడీపీని బలోపేతం చేసుకుందాం



మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు

చిలమత్తూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవకే పుట్టిన తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసుకుందామని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో టీడీపీ సమావేశం జరిగింది. కార్యక్రమానికి నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సంస్థాగత ఎన్నికల పరిశీలకులు రవిభూషణ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతలో భాగంగా సంస్థాగతంగా బలోపేతం చేసుకోవడానికి ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. అంజినప్ప, రంగారెడ్డి, లక్ష్మీనారాయణయాదవ్, బేకరీ గంగాధర్, నంజుండప్ప పాల్గొన్నారు.

గుడిబండ: టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. లక్ష్మీనరసప్ప, మద్దనకుంటప్ప, శ్రీనాథ్, పురుషోత్తం, శివకుమార్, రాజేంద్ర, బోజరాజ్,సన్నమారప్ప, నాగేంద్రప్ప పాల్గొన్నారు.

లేపాక్షి: ప్రజాఫిర్యాదుస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఆర్‌జేహెచ్ ఫంక్షన్‌హాల్‌లో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ అభి, జయప్ప, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి గాయాలు

గుడిబండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మజ్యోతిబాపూలే పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని జీఆర్ భవ్య పాఠశాలలో కిందపడి గాయపడింది. విషయం తెలుసుకున్న విద్యార్థిని తండ్రి రాజ్‌కుమార్ పాఠశాల వద్దకు చేరుకుని గాయపడిన కుమార్తెను మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య చికిత్సలు చేయించారు.

చింత చెట్ల నరికివేత

రొళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎన్ పాళ్యం గ్రామవాసి అనంతరాజ్‌కు చెందిన ఎనిమిది చింతచెట్లు గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసినట్లు గ్రామస్థులు తెలిపారు. స్పందించిన రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. 15సంవత్సరాల వయస్సున్న ఎనిమిది చింతచెట్లను నరికివేశారన్నారు. చుట్టుపక్కల విచారించినా తెలియరాలేదన్నారు. సమగ్రంగా విచారించి నివేదికను అధికారులకు సమర్పించనున్నట్లు రెవెన్యూ సహాయకుడు సోమశేఖర్ తెలిపారు.

జూదరుల అరెస్టు

మడకశిర రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమర్రి గ్రామ సమీపంలో జూద కేంద్రంపై శనివారం దాడి చేసినట్లు సీఐ నాగేశ్ బాబు తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.90,250 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు కేసు నమోదు చేశామన్నారు.

బైక్ చోరీ

హిందూపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో పార్క్‌చేసిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. రిటైర్డ్ ఏఎస్ఐ రామలింగప్ప ద్విచక్రవాహనాన్ని పార్క్‌చేసి దుకాణంలోకి వెళ్లారు. గమనించిన దుండగుడు మొఖానికి మాస్క్‌వేసుకుని ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లాడు. ద్విచక్రవాహనానికి పోలీస్ స్టిక్కర్ ఉన్నాకూడా ఎత్తుకెళ్లడం గమనార్హం.

సర్వేయర్ బదిలీ

రొద్దం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల సర్వేయర్ మైనుద్దీన్ బదిలీపై పుట్టపర్తికి వెళ్లారు. ఆయన స్థానంలో పెనుకొండలో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ కవిత ఇక్కడ నియమించారు. శనివారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

ఆర్టీసీలో ఉద్యోగోన్నతులు కల్పించాలి: ఈయూ

హిందూపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపోవద్ద రెండోరోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణస్వామి మాట్లాడుతూ ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10వేల ఉద్యోగాల నియామకాలకు ప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వాలన్నారు. నాయకులు బాబయ్య, విఘ్నేశ్వర్, ప్రసాద్, ఇర్షాద్ పాల్గొన్నారు.

మడకశిర రూరల్: మడకశిర డిపో ముందు ఆర్టీసీ కార్మికులు శనివారం రీజనల్ పబ్లిసిటీ కార్యదర్శి కామ్రేడ్ బీ ఆదినారాయణ ఆధ్వర్యంలో శనివారం ఎర్రబ్యాడ్జీలతో ధర్నా చేపట్టారు. ఆర్టీసీ కార్మకుల న్యాయమై కోర్కెలను ప్రభుత్వం వెంటనే తీర్చాలన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు రఫీక్,రీజనల్ సభ్యులు టీసిద్దగంగప్ప సెక్రటరీ కేటీ స్వామి, రవి, జె ప్రకాశ్ మంజునాథ్ కార్మికులు పాల్గొన్నారు.

పెనుకొండ: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన రెండోరోజూ కొనసాగింది. ఆర్టీసీ డిపోవద్ద నాయకులు నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆంజనేయులు, సాయి వంశి, విద్యాసాగర్, డిపో గ్యారేజీ ఉద్యోగులు పాల్గొన్నారు.



మడకశిర డిపో ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం

● జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ

హిందూపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): కోర్టు కేసులు పరిష్కారం కావాలంటే రాజీమార్గమే సరైందని జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఏడీజేతోపాటు సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్, ప్రత్యేక మెజిస్ట్రేట్ రమణయ్య పాల్గొన్నారు. మూడు బెంచీలు ఏర్పాటుచేసి 128కేసులు పరిష్కరించారు. నాలుగు భరణం కేసులు పరిష్కరించి రూ.19లక్షలు ఇప్పించగా, ఐదు చెక్‌బౌన్స్ కేసులు రూ.23.80లక్షలు బాధితులకు ఇప్పించారు. ఐపీసీ, ప్రమాదబీమా, సివిల్‌కేసులు, ప్రీలిటికేషన్ కేసులు మొత్తం 128కేసులుపరిష్కరించారు. కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన వారి నుంచి రూ.3,57,700 అపరాధ రుసుం ప్రభుత్వానికి జమచేయించారు. ఏపీపీ ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.



రాజీతో పరిష్కారమైన పత్రాన్ని అందిస్తున్న న్యాయాధికారులు

పెనుకొండ టౌన్: జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 264కేసులు పరిష్కారమయ్యాయి. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ వాసుదేవన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించిన కేసులు రాజీ అయ్యాయి. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బొజ్జప్ప, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్, న్యాయవాది భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మడకశిర టౌన్: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 226 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. న్యాయవాదులు త్రిలోక్, ఉమేష్‌చంద్ర, బాస్కర్, సీఐలు నాగేష్‌బాబు, రాజకుమార్ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ, మాజీ ఎమ్మెల్సీ

అన్నివర్గాల ప్రజలు మెచ్చేలా పాలన

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు మెచ్చేలా చంద్రన్న పాలన సాగుతోందని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శనివారం నగర పంచాయతీ చీపులేటీ, వజ్రపాళ్యం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ బీకేపార్థసారథి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామితో కలసి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. ప్రజల నుంచి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అభిప్రాయలు తెలసుకొన్నారు. వారు మాట్లాడుతూ ఏపీ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు పడిన ఇబ్బందులు, వారు ఎదుర్కొన్న సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తెస్తున్నారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి రవికుమార్, కౌన్సిలర్లు నరసింహరాజు, ఉమాశంకర్, హనుమంతు, బలరామ్, పుట్టకామప్ప, కిషోర్ పాల్గొన్నారు.



గాయత్రి కాలనీలో ప్రజలకు కరపత్రాలు పంచుతున్న నాయకులు

అగళి: మండల కేంద్రంలోని గాయత్రి కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని జడ్పీటీసీ, ఉమేష్, టీడీపీ మండల కన్వీనర్ మధూడి తిప్పేస్వామి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీ నరసింహప్ప, సర్పంచ్ రంగయ్య, కుమారస్వామి, శివకుమార్, కెంచప్పయాదవ్, రాజగోపాల్, శ్రీనివాస్, రమేష్, రాజునాయక్ పాల్గొన్నారు.



రొద్దం: సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ నాయకుడు మాధవనాయుడు అన్నారు. శనివారం శ్యాపురం గ్రామంలో సుపరిపాలన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. చిన్నప్పయ్య, ఆంజనేయులు, నర్సింహులు, రామక్రిష్ణప్ప, చంద్రమౌళి, శ్రీనాథ్ చౌదరి, పవన్, సర్పంచ్ మంజు, సిద్దన్న, లింగప్ప, పాల్గొన్నారు.



పరిగి: కూటమి ప్రభుత్వం సుపరిపాలనను ప్రజలకు మరింత చేరువచేసేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పార్టీ కార్యాలయంలో టీడీపీ బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పంచాయతీ అధ్యక్షులు సమావేశం నిర్వహించారు. ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించాలన్నారు. రెడ్డివారి మంజునాథ్, రామాంజి, ప్రభాకర్, తిప్పేస్వామి, పాళ్యంచంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సోమందేపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించి స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఐ నాయకులు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో శనివారం నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికాలంలో సర్దుబాటు చార్జీలపేరిట రూ.15.48 కోట్ల భారం ప్రజలపై మోపారన్నారు. అదానీతో గత ప్రభుత్వం 25ఏళ్లపాటు చేసుకున్న సోలార్ ఒప్పందాన్ని రద్దుచేయాలన్నారు. మండల కార్యదర్శి రాజగోపాల్, సహాయకార్యదర్శి అంజినమ్మ, చిల నారాయణస్వామి, గంగరాజు, బాబ్జాన్, శ్రీకాంత్, ముబారక్, మంచేపల్లి రామాంజనేయులు పాల్గొన్నారు.

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్‌చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని వాసవీ ధర్మశాల రోడ్డులో విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తాలూకా కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాన్యప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతోందని వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సమ్మెను విజయవంతం చేయండి



రబ్బర్ ఫ్యాక్టరీ మేనేజర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెనుకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 9వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి, హరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. బావమ్మ, వెంకటేశ్, నరసింహ, శ్రీరామ్, రవి, మంజు, శ్రీకాంత్ పాల్గొన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు స్థానిక ఈశ్వర్ రబ్బర్‌ఫ్యాక్టరీ మేనేజర్ రాజమణికి ఏఐటీయూసీ నాయకులు సమ్మె నోటీసును ఇచ్చారు. శనివారం ఫ్యాక్టరీకి వెళ్లిన నాయకులు సమ్మె నోటీసును అందిస్తూ 9న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు కూడా విధులకు రారని సమ్మెకు మద్దతు తెలిపారని కోరారు. బాలస్వామి, అంజినమ్మ, రామాంజినమ్మ, రాజగోపాల్, నారాయణస్వామి, శ్రీకాంత్, గంగరాజు పాల్గొన్నారు.